సాక్షి చిత్తూరు

గురువారం । 8 । ఆగస్టు । 2024



నేతన్నలను ఆదరించాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో చేనేత ఉత్పత్తులను ప్రమోట్ చేసేలా అవకాశం కల్పిస్తామని కలెక్టర్ ప్రకటించారు. - 8లో



బోయకొండలో భూ దందా

అధికారం అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలు, కాలువలు, కుంటలను ఆక్రమిస్తున్నారు. - 8లో



నేడే జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఎస్ఎంసీ ఎన్నికలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ట్రాన్స్‌కో తనిఖీలు

- 495 కేసులు నమోదు
- రూ.11.11లక్షలు జరిమానా

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో మంగళవారం రాత్రి ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,519 సర్వీసులను తనిఖీ చేసి, తిరుపతి ఆపరేషన్ 73, తిరుపతి రూరల్ 44, పుత్తూరు 91, చిత్తూరు అర్బన్ 58, చిత్తూరు రూరల్ 40, మదనపల్లె 67, పీలేరు 40, పుంగనూరు పరిధిలో 82 కేసులు బుక్ చేశారు. మొత్తం 495 కేసులు నమోదు చేసి అదనపు లోడు రుసుం, జరిమానా రూపంలో రూ.11.11 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు అందజేశామని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు వెల్లడించారు.

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లకు అనుమతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ల నిర్వహణకు అనుమతిస్తూ రాష్ట్ర ఏపీ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ నాగేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు చిత్తూరు జిల్లాలో 20 పాఠశాలలకు, 3 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రెన్యువల్ అనుమతులు మంజూరు చేశారు. సంబంధిత పాఠశాలు, జూనియర్ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం ఏపీ ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ స్టడీ సెంటర్ల తరగతులు, అడ్మిషన్లు నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

పకడ్బందీగా పశుగణన

–జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్ ఆదేశం



మాట్లాడుతున్న జేడీ డాక్టర్ ప్రభాకర్


చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలోని పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్ ఆదేశించారు. బుధవారం స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో ఆ శాఖ అధికారులు, సిబ్బందికి పశుగణనపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, పందులు..ఇత్యాది అన్ని రకాల పశు, పక్ష్యాదుల గణనను ఐదేళ్లకోసారి చేయడం పరిపాటి అని, ఇదే కోవలో ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ నుంచి డిసెంబరు నెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా 21వ అఖిల భారత పశుగణన నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందుకోసం 15 మంది పశు వైద్యాధికారులు, ఏడీలను సూపర్ వైజర్లుగా ఏర్పాటు చేసి, వారి ఆధ్వర్యంలో 321 మంది ఎన్యుమరేటర్లతో ప్రతి గ్రామంలో పశుగణన చేయాలన్నారు. దీనిని సమర్థవంతంగా చేస్తేనే ప్రభుత్వ రాయితీలు, సంక్షేమ ఫలాలు పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందుతాయన్నారు.సమావేశంలో పశుసంతతి సంరక్షణ శాఖ డీడీ డాక్టర్ హనీఫ్, పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రత దేవుడికెరుక



దేవాలయాల్లో భద్రత కరువుతోంది. నిఘా వ్యవస్థ కునుకుతీస్తోంది. మూడో కన్ను మూలకు చేరింది. ఇదే అవకాశంగా తీసుకుని దేవుడి సొత్తును కాజేస్తున్నారు. హుండీ లెక్కింపులో చేతివాటం చూపుతున్నారు. భగవంతుడి ఆభరణాలకు రక్షణ కరువుతోంది. విచారణ నత్త, తాబేలు నడకను తలపిస్తూ తీసుకుంటున్న చర్యలేమిటో పైవాడికే ఎరుక అన్నట్టు తయారైంది. ఇక అధికారులు పర్యవేక్షణను గాలి కొదిలేశారు. దీంతో దేవాలయాల పరిస్థితి దయనీయంగా మారుతోందని భక్తులు మండి పడుతున్నారు.





నిఘా ఉన్న చోట: కాణిపాకంలో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నిఘా పసిగట్టేనా...?

గత ప్రభుత్వం ఆలయాలపై జరుగుతున్న దాడులు, దోపిడీలకు చెక్ పెట్టే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంది. అన్ని ఆలయాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. చిన్న చిన్న గుళ్లా గోపురాలకు సైతం సీసీ కెమెరాలు విధిగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో పోలీసు, దేవదాయశాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన ఆలయాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆలయాలను నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచి పర్యవేక్షణ, భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతం ఆలయ నిఘా వ్యవస్థ గాడి తప్పింది. కొందరి నిర్లక్ష్యం కారణంగా ఆలయాల్లో సీసీ కెమెరాలు మూలనపడ్డాయి. అవి పూర్తిగా పని చేయడం లేదు. కొన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. ఫలితంగా ఆలయాల్లో చోరీలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి తరుణంలో పనిచేయని సీసీ కెమెరాలతో అధికారులు కుస్తీ పడుతున్నారు.

కాణిపాకం: జిల్లాలో 6–ఏ ఆలయాలు 5, 6–బీ ఆలయాలు 22, 6–సీ ఆలయాలు 26, 6–డీ 2 కలిపి మొత్తం 55 ఆలయాలున్నాయి. వీటి ద్వారా ఏటా రూ.80 కోట్లపైగా ఆదాయం వస్తోంది. ఈ ఆలయాలకు పూర్తిగా ఈఓ బాధ్యత వహిస్తుంటారు. ఈఓ సమక్షంలో ఆలయ ఆదాయం, జమాఖర్చులు పరిశీలించాలి. భక్తులు సమర్పించే కానుకలు, ఆభరణాలను పక్కాగా లెక్కించాల్సి ఉంది. అయితే ఇవన్నీ సక్రమంగా చేస్తున్నారా, లేదా? అని పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తూతుమంత్రంగా ఆలయాలను దర్శిస్తూ కార్యాలయాల్లో గడిపేస్తున్నారు.

లెక్కల్లో గోల్‌మాల్

జిల్లాలోని దేవాలయాల్లో కోట్లాది రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి, పంచ లోహాలతో తయారు చేసిన ఆభరణాలు ఉన్నాయి. అలాగే కోట్లాది రూపాయల విలువ చేసే కానుకలను సైతం భక్తులు సమర్పిస్తుంటారు. వీటిని లెక్కించడంలో లెక్కలు తారుమారవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక సీసీ కెమెరా పర్యవేక్షణ లేకుండా హుండీ ఆదాయం, కానుకలు ఎలా లెక్కిస్తారనే భక్తుల ప్రశ్నలకు సమాధానం లేదు. దీంతో పాటు ఆభరణాలు మాయమైతే అవి ఏమయ్యాయో తెలుసుకునే ప్రయత్నం చేయడానికి బదులు సర్దుకుపోవడం సరికాదని, దేవుడి సొత్తు..పరమపవిత్రంగా భావించి..లెక్కలు పక్కాగా ఉండేలా చూడాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. వీటిపై ఫిర్యాదులొస్తే అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

నిఘా లేని ఆలయంలో...

చిత్తూరు నగరం ఈశ్వర గుడివీధిలోని రెండు ఆలయాల్లో విలువైన వస్తువులు చోరీ అయ్యాయి. దీనిని ఆలయ సిబ్బంది గుర్తించారు. అయితే ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదని...ఓ భక్తుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. వారం క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందులో వాస్తమెంత? అనేదానిపై సీసీ కెమెరాలను పరిశీలిద్దామని చూస్తే..అవి పని చేయడం లేదని చోరీ ఉదంతాన్ని తోసిపుచ్చుతున్నారు. మంగళవారం విచారణ చేశారు. కానీ ఏం వెల్లడిస్తారో వేచి చూడాల్సి ఉంది. అలాగే ఆరు నెలల క్రితం నగరంలోని మరో ఆలయంలో కూడా ఆభరణాల లెక్కల్లో తారుమారయ్యాయి. దీనిపై డీసీ స్థాయిలో విచారణ చేశారు.



నిఘా ఉన్న ఆలయంలో...



హుండీ లెక్కింపు (ఫైల్)

కాణిపాకం దేవస్థానంలో మే 30న ఆదాయం హుండీ లెక్కించారు. ఈ లెక్కింపులో ఓ బ్యాంకు అప్రైజర్ 100 గ్రాముల బంగారు బిస్కెట్, రూ. 500 నగదును చాకచక్యంగా నొక్కేశాడు. ఇది గమనించిన సీసీ కెమెరా నిఘా కేంద్ర సిబ్బంది ఈఓ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని సిబ్బంది ద్వారా అప్రైజర్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో బంగారు బిస్కెట్, నగదు బయటపడింది. అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించారు.

ఆలయ, ఆదాయ వివరాలు

ఆలయ రకం	ఆలయాల సంఖ్య	ఆదాయం
6ఏ	5	రూ.79.57 కోట్లు
6బీ	22	రూ.3.70కోట్లు
6సీ	26	రూ.27.46 లక్షలు
6డీ	2	రూ. 2 లక్షలు

పర్యవేక్షిస్తే ఒట్టు

ఆలయాల పర్యవేక్షణను అధికారులు పూర్తిగా గాలి కొదిలేశారు. ఇతరత్రా వాటికి ప్రాధాన్యత ఇస్తూ పట్టించుకోవడం లేదు. హుండీ ఆదాయం లెక్కింపులు, ఇతర సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మరొకరి సాయంతో నెట్టుకొస్తున్నారు. దీంతో ఆలయాల భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అన్ని మూలాలు తెలుసుకున్న అధికారులు షరా మూమూలే అన్నట్టు ఫిర్యాదులను కొట్టిపడేస్తున్నారు. కొందరు ఇక్కడే కొన్నేళ్లుగా పాతుకు పోవడం వల్లే జిల్లాలోని ఆలయాలకు ఈ దుస్థితి కలిగిందని కింది స్థాయి అధికారులు, అర్చకులు వాపోతున్నారు. ఉన్నతాధికారులైన స్పందించి ఆలయాల భద్రతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.



చిత్తూరు నగరంలోని దేవదాయశాఖ కార్యాలయం

ఫిర్యాదు చేశాం



రెండు వారాల క్రితం ఈశ్వరగుడివీధిలోని ఆలయాల్లో జరిగిన చోరీపై అధికారులు పట్టించుకోలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. ఎండోమెంట్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఆ ఆలయంలో సీసీ కెమెరాలు పని చేయడంలేదు. ఇలా చాలా చోట్ల ఇదే పరిస్థితి. ఈ కారణంగా ఆలయాల్లో ఏం జరుగుతోందో తెలియడం లేదు. హుండీ లెక్కింపు జరిగేటప్పుడు గుట్టుచప్పుడు కాకుండా చేస్తున్నారు. దీనిపై పలు అనుమానాలున్నాయి. భక్తులు వస్తు, ఆభరణ రూపేణా ఇచ్చే వాటిని రిజిస్టర్‌లో పక్కాగా నమోదు చేయాలి. – రామభద్ర, భక్తుడు, చిత్తూరు

ఫిర్యాదులొస్తే విచారణ



ఆలయాల్లో చోరీలు, లెక్కలు తేడాలొస్తే వెంటనే స్పందిస్తున్నాం. విచారణ చేస్తున్నాం. ఆలయాలకు భంగం కలగకుండా చూస్తున్నాం. పనిచేయని సీసీ కెమెరాలను ఆరా తీసి వాటిని సరి చేయిస్తాం. లెక్కలు, ఇతరత్రా వాటిపై ఫిర్యాదుల వస్తే..ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పందిస్తున్నాం. భక్తులు కూడా ఏవైనా సమస్యలు వస్తే మా దృష్టికి తీసుకురావచ్చు.

– ప్రసన్నలక్ష్మి, దేవదాయశాఖ ఏసీ, చిత్తూరు

విద్యుత్ గ్రీవెన్స్‌కు 38 సమస్యలు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, తిరుపతి జిల్లాలో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించారు. డివిజన్, సబ్ డివిజన్ల వారీగా మొత్తం 38 సమస్యలు అధికారులకు వినియోగదారులు నివేదించారు. వీటిలో18 సమస్యలను పరిష్కరించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఎక్కువగా పేరు బదిలీ, ట్రీ కటింగ్, తప్పుడు బిల్లులు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి సమస్యలపై వినతులు అందాయని, వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. చిత్తూరులో ఈఈ మునిచంద్ర, హరి, డీఈలు పద్మనాభపిళ్లై, శేషాద్రి, జ్ఞానేశ్వర్ తదితరులు ఫిర్యాదులు స్వీకరించారు.



చిత్తూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

మెప్మా సిబ్బందిపై వేటు

పలమనేరు: 'డాయ్' దెబ్బకు మెప్మా సిబ్బందిపై వేటు పడింది. డాయ్ యాప్ మోసాలపై స్పందించిన కలెక్టర్ ఇక్కడ విచారణ నిమిత్తం త్రిసభ్య కమిటీని నియమించడం తెలిసిందే. మెప్మా సిబ్బందిపై విచారణ చేసిన కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు సిటీ మిషన్ మేనేజర్ ఉమేష్ జాదవ్, ముగ్గురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్, 14మంది ఆర్పీలను తొలగించేలా మెప్మా పీడీ ఆదేశాలను జారీ చేశారు. అలాగే వీరిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశించారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలు పూర్తి చేయండి



హాజరైన అధికారులు, సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

- హౌసింగ్ సమీక్షలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పెండింగ్ గృహాల విషయంలో వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను విధిగా చేరుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో హౌసింగ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ఇళ్ల నిర్మాణాలను పకడ్బందీగా చేపట్టాలని, ఆ ఇళ్ల నిర్మాణల్లో పురోగతి ఉండాలన్నారు. 22,125 ఇళ్లను వంద రోజుల్లో పూర్తి చేసేందుకు కసరత్తు చేయాలని, ఎవరైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంజూరైన ఇళ్లను పూర్తి చేసేందుకు ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి, మాట్లాడి సమస్యలున్నట్లైతే పరిష్కరించాలన్నారు. అర్బన్ పరిధిలోని మెప్మా, రూరల్‌లో డీఆర్‌డీఏ శాఖల ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీ మహిళలు రుణాలు మంజూరు చేయించాలన్నారు. నియోజకవర్గాల వారీగా స్టేజ్ కన్వర్షన్‌కు సంబంధిత ఈఈలు, డీఈలు, ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎంపీడీఓలు, గృహనిర్మాణ శాఖ ఈఈ, డీఈలు పాల్గొన్నారు.

సైబర్ కరెంట్ షాక్

- గత ఏడాది సైబర్ నేరగాళ్లు ప్రైవేటు ఆస్పత్రులను టార్గెట్ చేశారు. చిత్తూరులోని రెండు ఆస్పత్రుల కరెంటు బిల్లు కట్టాలంటూ రూ.9,000 లింక్ ద్వారా రప్పించుకున్నారు. దీనిపై విచారణ చేయగా ఆ మొత్తంలో చిత్తూరు, కల్లూరులోని పెట్రోల్ బంక్‌లలో యూపీఐ వాడి నేరగాళ్లు లబ్ధి పొందినట్లు తేలింది.
- గత నెల చిత్తూరుకు చెందిన ఓ వినియోగదారుడు ఫోన్‌కు ఓ మెస్సేజ్ వచ్చింది. ఆ రోజు రాత్రి 9.30 గంటల లోపు పెండింగ్ విద్యుత్ బిల్లు కట్టకపోతే సరఫరా కట్ చేస్తామని అందులో సారాంశం. ఆ వ్యక్తి నేరుగా గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లి ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు.

- బిల్లు కట్టలేదట.. కరెంటు కట్ చేస్తారట!
- ఎస్ఎంఎస్‌తో లింకులు
- క్లిక్ చేస్తే డబ్బులు మొత్తం ఖాళీ
- అప్రమత్తంగా ఉండాలంటున్న ట్రాన్స్‌కో అధికారులు



చిత్తూరులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయం



వినియోగదారుడికి వచ్చిన ఎస్ఎంఎస్

చిత్తూరు కార్పొరేషన్: సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎంతగా అప్రమత్తం చేస్తున్నా ఏదో ఒక రూపంలో ప్రజలు వారి బారిన పడుతూ నష్టపోతూనే ఉన్నారు. వారి బారిన పడి డబ్బులు కోల్పోయిన బాధితుల గురించి పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో కథనాలు వస్తుండడంతో నేరగాళ్లు సైతం అప్‌డేట్ అవుతున్నారు. ప్రజల జేబులు కొల్లగొట్టేందుకు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. ఇప్పుడు విద్యుత్ వినియోగదారులను టార్గెట్ చేసుకుని అందినకాడికి దండుకునేందుకు లింకులు పంపుతున్నారు. ''మీరు విద్యుత్ బిల్లు చెల్లించలేదు. తక్షణమే కట్టాలి. లేని పక్షంలో మీ కనెక్షన్ కట్ చేస్తాం.. మీ ఫోన్‌కు ఎస్ఎంఎస్ పంపుతున్నాం.. అందులోని లింక్ క్లిక్ చేసి నగదు చెల్లించండి'' ఇలా సైబర్ నేరగాళ్లు విద్యుత్ వినియోగదారులకు ఎస్ఎంఎస్‌లు పంపుతున్నారు. పొరపాటున ఆ లింక్‌ను ఓపెన్ చేస్తే బ్యాంక్ అకౌంట్లోని నగదు మొత్తం హుష్‌కాకి అవుతుంది. ఇప్పటికే కొందరు మోసపోయి లబోదిబోమంటున్నారు.

ఎలా మోసం చేస్తారంటే..!

మొదట వినియోగదారుడిని ఎంచుకుని వారి ఫోన్ నంబరుకు మెస్సేజ్ పంపుతారు. అందులో మీరు విద్యుత్ బిల్లు చెల్లించాల్సి ఉంది. వెంటనే కట్టేయండి. లేకపోతే సర్వీస్ కనెక్షన్ కట్ చేస్తాం. ఏమైనా సందేహాలుంటే..సంబంధిత అధికారికి ఫోన్ చేయాలంటూ ఒక నంబర్ ఇస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి మధ్య సమయాల్లోనే విద్యుత్ వినియోగదారులకు సైబర్ నేరగాళ్లు ఇలా ఎస్ఎంఎస్‌లు అధికంగా పంపుతున్నారు. బిల్లు కట్టని వారికే కాకుండా కట్టిన వారికి సైతం ఇలా మెస్సేజ్‌లు పంపి బురిడీ కొట్టిస్తున్నారు. మరుసటి రోజు ఉదయం ఆ మెస్సేజ్ చూసి వినియోగదారులు ఒకింత ఆందోళనతో అందులో పేర్కొన్న నంబర్‌కు ఫోన్ చేస్తున్నారు. దీంతో ఆవలి వ్యక్తి కాల్ లిఫ్ట్ చేసి తాను విద్యుత్‌శాఖ అధికారిగా పరిచయం చేసుకుని వెంటనే బిల్లు చెల్లించాలంటూ లింక్ పంపుతాడు. దీని ద్వారా బిల్లు చెల్లిస్తే కనెక్షన్ కట్ చేయమని నమ్మబలుకుతుండడంతో వినియోగదారుడు నిజమేనని భావించి లింక్ క్లిక్ చేస్తున్నారు. అంతే! ఆ తర్వాత ఫోన్ సైబర్ నేరగాళ్ల కంట్రోల్లోకి వెళ్లి పోవడం.. వారు వినియోగదారుల బ్యాంకు ఖాతా లోని సొమ్ము కాజేయడం మాయం అవడం జరుగుతోంది. ఆలస్యంగా ఇది తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ అటు ట్రాన్స్‌కో, ఇటు పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో కేటగిరి వారీగా సర్వీసులు

గృహ సర్వీసులు	13,73,346
వాణిజ్యం	1,61,215
పరిశ్రమలు	21,175
ప్రభుత్వ సర్వీసులు	46,690
వ్యవసాయం	3,17,709
వీధిదీపాలు	17,000
ఆర్‌డబ్ల్యూఎస్	13,924
హెచ్‌టీ	1,906
మొత్తం	19,52,790

మోసానికి యత్నించారు



నా మొబైల్‌కు కరెంటు బిల్లు కట్టాలని ఎలక్ట్రిసిటీ ఆఫీసర్ పేరు మీద మెస్సేజ్ వచ్చింది. గత నెల బిల్లు పెండింగ్ ఉందన్నారు. తీరా ఈఈ కార్యాలయానికి వెళ్లి ఆ నంబరుకు కాల్ చేస్తే స్పందించలేదు. తమ శాఖలో ఎలక్ట్రిసిటీ ఆఫీసర్ పోస్టే లేదని అధికారులు చెప్పారు. ఎస్ఎంస్‌లను గుడ్డిగా నమ్మకుండా విచారణ చేయాలి.

– మధుసూదన్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి చిత్తూరు

యాప్‌లో లేదా నేరుగా కట్టండి



యూపీఐ ద్వారా నేరుగా విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఆపివేశారు. ఏపీ ఎస్పీడీసీఎల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో బిల్లు సులభంగా కట్టవచ్చు. అలా కానిపక్షంలో స్థానిక విద్యుత్ కార్యాలయాల్లో బిల్లులు చెల్లించండి. ట్రాన్స్‌కో శాఖ నుంచి ఫోన్ చేసి ఎవరూ ఎస్ఎంఎస్ లింక్ పంపరు. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతిలో మా శాఖ పేరు వాడుకుని ప్రజలను మోసం చేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల మోసాలపై అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించాం. బిల్లు కట్టలేదని..ఫలాన నంబర్‌కు ఫోన్ చేయాలని మెస్సేజ్ వస్తే ఆందోళన చెందకుండా స్థానిక ట్రాన్స్‌కో సిబ్బందిని సంప్రదించండి.

– సురేంద్రనాయుడు, ఎస్ఈ ట్రాన్స్‌కో

బస్సు చక్రం ఊడినా అందరూ సేఫ్



రోడ్డుపై వెళుతున్న బస్సు నుంచి వీడిపోయి బస్సు వెనుక చక్రం ముందుకు వెళ్లింది. అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పింది. వివరాలు.. బుధవారం మండలంలోని ముదరందొడ్డి నుంచి వి.కోటకు ఉదయం 9 గంటల సమయంలో స్కూలు, కళాశాల విద్యార్థులతో వస్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రం ఊడి బస్సుకంటే ముందుకు వెళ్లింది. డ్రైవర్ ఇది గమనించి ఒక్కసారిగా బ్రేక్‌వేసి ఆపేశాడు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం బారిన పడకుండా బైటపడ్డారు. సాక్షాత్తు సీఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని కుప్పం డిపో బస్సు ఫిట్‌నెస్ ఇలా ఉంటే ఎలా? అని ప్రయాణికులు ప్రశ్నించారు. – వి.కోట

క్లుప్తంగా

300 వరకు సెల్‌ఫోన్లు స్వాధీనం

చిత్తూరు అర్బన్‌: జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన పలు సెల్‌ఫోన్లను చిత్తూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలియవచ్చింది. చాట్‌బోట్‌ సాయంతో బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా ఎస్పీ మణికంఠ పర్యవేక్షణలోని పోలీసుల బృందం 300 పైగా సెల్‌ఫోన్లను చిత్తూరుకు తీసుకొచ్చినట్లు సమాచారం. గురువారం వీటిని చిత్తూరులో బాధితులకు అందచేయనున్నట్లు పలువురు బాధితులకు పోలీసుశాఖ సమాచారమిచ్చింది.

కక్ష కట్టి..తవ్వేసి..!



అస్లాం బాషా ఇంటిముందు తవ్విన కాలువ

పలమనేరు: తాను వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కావడంతో కక్షతో తన ఇంటిముందు సీసీ రోడ్డును తవ్వేసి, అందులో పైపులైన్‌ ఏర్పాటు చేశారని పట్టణంలోని 17వార్డుకు చెందిన అస్లాంబాషా, హైదర్‌ బుధవారం తెలిపారు. ఇంటి ముందు సీసీరోడ్డు డ్రైన్‌ ఉండగా 45 అడుగుల దూరం నుంచి కాలువ తవ్వారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్‌ అధికారులు స్పందించాలని కోరారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

చిత్తూరు కార్పొరేషన్‌: పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు జెడ్పీ సీఈఓ గ్లోరియా, డీపీఓ లక్ష్మి తెలిపారు. పారిశుధ్యం, సాలిడ్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌, జీపీడీపీ అంశాలపై గురువారం నుంచి మూడురోజుల పాటు శిక్షణ ఆయా మండలాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. చిత్తూరు, పాలసముద్రం, రొంపిచెర్ల, సోమల, రామకుప్పం, గుడుపల్లె, నగరి, పలమనేరు, యాదమరి, మదనపల్లె, ములకలచెరువు, నిమ్మనపల్లె, వాల్మీకిపురం, కలకడ, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళ్యం, రామచంద్రాపురం, వరదయ్యపాళెం, నారాయణవనం, పిచ్చాటూరు, రేణిగుంట మండల కార్యాలయాల్లో ట్రైనీలు శిక్షణ ఇస్తారని చెప్పారు.

బోయకొండలో భూ దందా

బోయకొండ ఆలయ సమీపంలోని గ్రామాల చుట్టూ ఉన్న భూములకు రెక్కలొచ్చాయి. గ్రామాలను అనుసంధానం చేస్తూ పొలాల్లో గత ప్రభుత్వం తారురోడ్డు వేయడంతో భూముల ధరలు లక్షలు పలుకుతున్నాయి. ప్రస్తుతం అధికారం అడ్డుపెట్టుకుని కొందరు దర్జాగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు. కొండలు, గుట్టలు, కాలువలు, కుంటలను సైతం ఆక్రమించి ఎక్సవేటర్ల సాయంతో పూడ్చివేస్తున్నారు. మరోవైపు అటవీ మార్గం నుంచి సైతం టిప్పర్లతో ఎర్రమట్టిని తరలించి లోతట్టు ప్రదేశాలను చదును చేసేస్తున్నారు.

- యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- కొండలు, గుట్టలు, కాలువలు, కుంటలు పూడ్చివేత
- కొదమదేవర గుట్ట చుట్టూ ఆక్రమణలే!
- చేతులు మారుతున్న అసైన్డ్‌ భూములు



కొదమదేవర గుట్ట నుంచి వచ్చే వర్షపునీటికి అడ్డంగా రాళ్లువేసి పూడ్చివేసిన దృశ్యం

చౌడేపల్లె: బోయకొండ సమీపంలో యానాది ఇండ్ల మార్గంలోని కొదమదేవర గుట్ట వద్ద ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయి. గుట్ట పరిసర ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు కాపువానికుంటలోకి వెళ్లే సప్లయ్‌ చానల్‌ను సైతం పూడ్చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఓ రైతు పంట కాలువ నుంచి చెరువు వచ్చే డ్యామ్‌కు అడ్డంగా రాళ్లు సైతం వేసి నీళ్లు రాకుండా చేశారని వాపోతున్నారు. అలాగే కొన్నేళ్ల క్రితం ఏర్పాటుచేసిన చిన్నకుంటను నామరూపాలు లేకుండా పూడ్చి చదును చేసేశారు. ఆ ప్రాంతంలోని కాలువలు, పశువుల మేత భూమి, బీడు భూములను కబ్జా చేశారు. చివరకు పశువులు వెళ్లే దారిని సైతం లేకుండా చేశారంటే ఆక్రమణలు ఏ స్థాయిలో ఉంటున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్‌ భూములను సైతం ఆక్రమించి, ఆ భూములు లబ్ధిదారులకు నయానో భయానో ఎంతో కొంత ముట్టచెప్పి చదును చేసే పనులు బోయకొండ పరిసర ప్రాంతంలో జోరుగా సాగుతున్నాయి. అలాగే, కొందరు అసైన్డ్‌ భూముల లబ్ధిదారులు స్థానికంగా లేరని తెలుసుకుని ఆ భూములను కబ్జా చేసి తమ పరం చేసుకుంటున్నారు. దీనిపై స్థానికులు, చుట్టుపక్కల వారు ప్రశ్నిస్తే.. తమకు పట్టా ఉందని, కొనుగోలు చేశామని, పూర్వీకుల నుంచి వంశపారం పర్యంగా వస్తోందని బుకాయించడం పరిపాటిగా మారింది. అయితే ఎవరి వద్దా రికార్డులు లేకున్నప్పటికీ కబ్జా చేస్తుండటం గమనార్హం!

ఆక్రమణలపై సర్వే

బోయకొండ సమీపంలోని కొదమదేవర గుట్ట వద్ద సర్వే నంబర్‌ 471/2లో 2.62ఎకరాలు, 191/1లో 1.25 ఎకరాలను యానాది కులస్తులైన రామయ్య, గంగులప్పకు సుమారు 30 ఏళ్ల క్రితం పట్టాలిచ్చినట్లు సర్వేయర్‌ గుణశేఖర్‌ తెలిపారు. బుధవారం ఆక్రమిత స్థలాలను సర్వే చేశారు. కొన్నేళ్ల క్రితమే ఈ గ్రామం విడిచి వెళ్లిపోయారని గ్రామస్తులు అధికారులకు తెలిపారు. చిన్నకుంట పూడ్చి వేశారని, కాలువలు, బండి దారులు, వంకలు ఆక్రమణల పాలయ్యాయని, కొండ చుట్టూ ఆక్రమణలపై సర్వే చేసి తహసీల్దార్‌ హనుమంతు నాయక్‌కు నివేదిక ఇస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వేలో ఆయన వెంట సచివాలయ సర్వేయర్‌ మురళీకృష్ణ పాల్గొన్నారు.



రికార్డుల ఆధారంగా సర్వే చేస్తున్న అధికారులు



మట్టి తోలి పూడ్చేసిన చిన్నకుంట



గుట్టనుంచి జేసీబీ సాయంతో మట్టి తరలిస్తున్న టిప్పర్లు

నేడే జిల్లాలో ఎస్‌ఎంసీ ఎన్నికలు

- కసరత్తు పూర్తి చేసిన విద్యాశాఖ
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు
- ప్రభుత్వ బడుల వద్ద 144 సెక్షన్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీన ఎస్‌ఎంసీ (స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ) ఎన్నికలు నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు డీఈఓ దేవరాజు, సమగ్ర శిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే డీవైఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎంలకు మార్గదర్శనం చేశారు.

మొత్తం 2,463 స్కూళ్లలో..

జిల్లాలోని 2,463 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలను నిర్వహించనున్నారు. ప్రాథమిక 1,822, ప్రాథమికోన్నత 185, ఉన్నత 456 హైస్కూళ్లలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ చైర్మన్‌, వైస్‌ చైర్మన్లను కమిటీ సభ్యులు ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నికయ్యే ఎస్‌ఎంసీ చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌, కమిటీ మెంబర్లతో ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు ప్రతిజ్ఞ చేయిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు మొదటి ఎస్‌ఎంసీ కమిటీ సమావేశం నిర్వహిస్తారు. ఎన్నికలు జరిగే పాఠశాలల వద్ద 144 సెక్షన్‌ విధించనున్నట్లు అధికారులు చెప్పారు.

ఎఫ్‌బీఓపై వేటగాళ్ల బృందం దాడి

- కొలమాసనపల్లె అడవిలో ఘటన
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

పలమనేరు: ఫారెస్ట్‌బీట్‌ ఆఫీసర్‌పై వేటగాళ్లు కత్తితో దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని కొలమాసనపల్లె ఫారెస్ట్‌ రేంజిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గురువారం ఇది చర్చనీయాంశమైంది. వివరాలు..కొలమాసనపల్లెకు చెందిన 15మంది దాకా వేటగాళ్లు వన్యప్రాణుల వేటకు వెళ్లారు. కొంతకాలంగా వన్యప్రాణుల్ని వేటాడుతున్నారనే సమాచారం స్థానిక అటవీశాఖ అధికారులకు అందింది. దీంతో కొలమాసనపల్లె బీట్‌ ఆఫీసర్‌ పరమేష్‌ వెంటనే మోటార్‌ సైకిల్‌పై అడవిలోకి వెళ్లాడు. అక్కడ వేటగాళ్లను గుర్తించి వారిని పట్టుకునేందుకు యత్నించడంతో వారంతా ఆయనపై దాడి చేశారు. ఓ వేటగాడు బీట్‌ ఆఫీసర్‌ గొంతుపై కత్తి పెట్టి కోసేందుకు ప్రయత్నించగా ఆయన వారి బారి నుంచి తప్పించుకుని పారిపోయి వచ్చేశారు. నేరుగా పలమనేరు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. వేటగాళ్లలో కొందరిని గుర్తించారని, వారిలో వినోద్‌, మోహన్‌, శేఖర్‌ తదితరులున్నారని పోలీసులకు ఆయన తెలిపారు.

రంగంలో దిగిన రాజకీయ నాయకులు

వేటగాళ్లపై బీట్‌ ఆఫీసర్‌ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నాయకులు రంగంలోకి దిగి కేసు లేకుండా రాజీ ప్రయత్నాలు చేసినట్టు తెలిసింది. దీనిపై మండిపడిన బాధితుడు తాను ఫిర్యాదు వాపసు తీసుకోనంటూ సెల్‌ ఫోన్‌ స్విచ్ఛాఫ్‌ చేసి అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలియవచ్చింది. ఇది చర్చనీయాంశమైంది.

భూమి కాజేయాలని దాడులు చేస్తున్నారు

- ఎస్సార్‌పురం మండల వాసి నివేదన'

చిత్తూరు రూరల్‌ (కాణిపాకం): తాతల కాలం నుంచి అనుభవంలో ఉన్న సెటిల్‌మెంట్‌ భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్‌ఆర్‌ పురం మండలం జీఎంఆర్‌ పురం పంచాయతీ వడ్డికండ్రిగకు చెందిన కృష్ణయ్య బుధవారం మీడియాను ఆశ్రయించారు. స్థానిక ప్రెస్‌ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు 6.72 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఆ భూమిని కాజేసేందుకు గ్రామస్తులు కొందరు తమ కుటుంబంపై దాడులు చేస్తున్నారని, దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లా కలెక్టర్‌, ఎస్పీ తనకు న్యాయం చేయాలని, తనకు ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలని కోరారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

బంగారుపాళెం: స్థానిక దళితవాడలో ఏర్పాటు చేసిన హెల్త్‌ క్యాంప్‌ను బుధవారం జిల్లా వైద్యాధికారి ప్రభావతిదేవి సందర్శించారు. దళితవాడలో కొందరు వాంతులు, విరేచనాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో తుంబకుప్పం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దళితవాడలోని రాములుగుడి, బంగారుపాళెం గ్రామ సచివాలయం–2లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరాలను తనిఖీ చేసి బాధితుల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. తాగునీటి శాంపిళ్లను సేకరించి పరీక్షల నిమిత్తం తిరుపతికి పంపారు. ఇంటింటా సర్వే చేయాలని ఆదేశించారు. పరిసరాలను పరిశీలించారు. క్లోరినేషన్‌, శానిటేషన్‌ చేయాలన్నారు. రెండు రోజుల క్రితం గ్రామంలో ఓ కార్యక్రమంలో భోజనం చేసినప్పటి నుంచి ఇలా అస్వస్థతకు గురయ్యారని డీఎంఅండ్‌హెచ్‌ఓకు తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ లోహిత్‌చెంగల్‌రాయస్‌ తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ లక్ష్మి, డాక్టర్లు రమేష్‌, లోకేష్‌, జిల్లా హెపిటమాలజిస్ట్‌ వాణి, స్థానిక సర్పంచ్‌ ఉమాదేవి, గ్రామ కార్యదర్శులు శంకరయ్య, అవతి, హెల్త్‌ సూపర్‌వైజర్‌ హరికృష్ణ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య శిబిరం వద్ద జిల్లా వైద్యాధికారి ప్రభావతిదేవి

రేపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

- జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లా స్థాయిలో ఈ నెల 9న ఉదయం 11 గంటలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మిషన్‌ డైరెక్టర్‌ టీసీఆర్‌, టీఎం (ట్రైబల్‌ కల్చర్‌ రీసెర్చ్‌ అండ్‌ ట్రైనింగ్‌ మిషన్‌) విశాఖపట్టణం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని గిరిజన సంఘాల నాయకులు, గిరిజన విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేతన్నలను ఆదరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న నేతన్నలు

- చేనేత కార్మికులను సత్కరించిన కలెక్టర్‌ సుమిత్‌ కుమార్‌ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్‌ : చేనేత కార్మికులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కలెక్టర్‌ సుమిత్‌ కుమార్‌ గాంధీ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో 10వ జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్‌ మాట్లాడారు. చేనేత ఉత్పత్తులకు ఇతర రాష్ట్రాలు, నగరాలలో మంచి డిమాండ్‌ ఉందన్నారు. చేనేత ఉత్పత్తులకు కలెక్టరేట్‌, సబ్‌రిజిస్ట్రార్‌, ఆసుపత్రులు, జెడ్పీ కార్యాలయం, మండల కార్యాలయాల్లో తాత్కాలికంగా ప్రమోట్‌ చేసేలా అవకాశం కల్పిస్తామని, అలాగే చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్‌ కల్పించేలా త్వరలో జిల్లా వ్యాప్తంగా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నేత కార్మికులకు అవసరమైన బ్యాంకు రుణాలు, ఇన్సూరెన్సు..ఇత్యాది అంశాలపై రానున్న సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అనంతరం 10 మంది నేతన్నలను కలెక్టర్‌ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో చేనేత శాఖ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్‌ వెంకటేశ్వర్లు, నేతన్నలు పండీనాథ్‌, కుప్పయ్య, వాసు, కృష్ణయ్య, నీలకంఠం, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

పుంగనూరు: పెళ్లి బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం చిన్నకొండచెర్లలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలో పెళ్లివారిని దించేందుకు వచ్చిన బస్సును నిర్లక్ష్యంగా డ్రైవర్‌ వెనక్కు నడపడంతో వెంకటరెడ్డి (90) బస్సు కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.



మృతి చెందిన వెంకటరెడ్డి

డ్రైవర్‌పై కత్తితో దాడి..నగదు దోపిడీ

బంగారుపాళెం: డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి నగదు దోచుకున్న సంఘటన మంగళవారం రాత్రి మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. గోవా నుంచి చెన్నైకు ఏసీ మెషిన్ల లోడుతో వెళ్తున్న కంటైనర్‌ను డ్రైవర్‌ రంజిత్‌పాండే టోల్‌ ప్లాజా సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలిపాడు. కొంతసేపటికి ఆగంతకులు కొందరు అతడిపై కత్తితో దాడి చేసి అతని వద్ద రూ.3500 లాక్కున్నారు. వారిని ప్రతిఘటించి కేకలు వేయడంతో వాహనదారులు అక్కడికి చేరుకునే లోపు వారంతా పారిపోయారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





డ్రైవర్‌ రంజిత్‌పాండే, దుండగుల దాడిలో రంజిత్‌కు అయిన కత్తి గాయం

యాజమాన్యంతో అధిక దిగుబడి



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెదురుకుప్పం : మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా ఉద్యావన శాఖ అధికారి మధుసూదన్‌ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మయ్యపల్లెలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాయల కోత అనంతరం కొమ్మల కత్తిరింపు ఆవశ్యకతను వివరించారు. ఎరువుల వాడకం, దున్నకాల గురించి తెలియజేశారు. అక్టోబర్‌ 15 నుంచి దున్నకాలు చేసుకోవాలన్నారు. డ్రిప్‌ ఇరిగేషన్‌ గురించి, రాయితీపై ఇచ్చే డ్రిప్‌ పరికరాలు, స్ప్రింక్లర్ల గురించి వివరించారు. ఇవి కావలసిన వారు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్‌ చేసుకుని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యావనశాఖాధికారి వింధ్య, వ్యవసాయాధికారిణి వనిత, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.